చెత్తను తొలగించిన శానిటేషన్ అధికారులు, సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హయత్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మన్సూరాబాద్ డివిజన్ శానిటేషన్ అధికారులు సిబ్బంది స్పందించారు. హయత్‌నగర్ బొమ్మలగుడి, అంజనాద్రినగర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కంపుకొడుతున్న రోడ్లు.. చెత్తకుప్పలతో పరిసరాలు, అనే శీర్శికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు, శానిటేషన్ సిబ్బంది బుధవారం ఉదయమే అక్కడికి చేరుకుని కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన చెత్తను తొలగించి పరసరాలను శుభ్రం చేశారు. అక్కడ చెత్త పాయింట్ లేకున్నా కొంత మంది వాహనాలపైన చెత్తను తీసుకువచ్చి అక్కడ వేస్తున్నారని సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్తను తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.


శుభ్రం చేసిన తర్వాత బొమ్మలగుడి- అంజనాద్రి రోడ్డు


క్రిడాలో క్షేత్రస్థాయి పంటల సాగును పరిశీలించడానికి వచ్చిన ఐసీఆర్ డైరెక్టర్లు, ప్రతినిధులు

క్రిడాను సందర్శించిన ఐసీఆర్ డైరెక్టర్లు

హయత్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ(క్రిడా)ను బుధవారం నేషనల్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(ఎన్‌ఆర్‌ఎం)కు చెందిన ఏడుగురు ఐసీఆర్ డైరెక్టర్లతో పాటు పలువురు ప్రతినిధులు సందర్శించారు. ఈసందర్భంగా టెక్నాలజీ పార్కు, రెయిన్‌ఫెడ్ హార్టికల్చర్ సిస్టమ్, కన్జర్‌వేషన్ అగ్రికల్చర్ సిస్టమ్, ఆగ్రో పారెస్ట్రీ క్షేత్ర ప్రయోగాలను పరిశీలించారు. అదేవిధంగా వ్యవసాయ యంత్రాలు, సీడ్ హబ్, సోలార్ పవర్డ్ మైక్రో ఇరిగేషన్ సిస్టమ్, సేంద్రియ పంటల సాగు పద్ధతులను సందర్శించారు. సంతోష్‌నగర్‌లోని సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ ఫర్ డ్రై లాండ్ అగ్రికల్చర్‌లో జరిగిన రెండు రోజుల ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టుల సమీక్షా సమావేశం అనంతరం వారు హయత్‌నగర్‌లోని క్రిడాకు వచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఎం ఛైర్మన్ ఎస్‌కే చౌదరి, క్రిడా డైరెక్టర్ వీకే సింగ్, ఐసీఆర్ డైరెక్టర్ల పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆయాచితం శ్రీధర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ఎల్బీనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్‌ను ఎమ్మెల్యే సబితారెడ్డి పరామర్శించారు. బుధవారం ఆర్‌కేపురంలోని ఆస్పత్రికి వెళ్లి శ్రీధర్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని శ్రీధర్‌కు సూచించారు. శ్రీధర్‌ను పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నగేష్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంనర్సింహగౌడ్, శ్రీనివాస్, సాజిద్, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.


ఆయాచితం శ్రీధర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి


మొక్కలను నాటుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం బీఎన్ రెడ్డినగర్ డివిజన్ ఎస్కేడినగర్‌లోని సురభిపార్కులో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. భూమిపై జీవిస్తున్న ప్రతి జీవరాశికి చెట్లే ఆధారమని వాటిని పెంచి కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.


విద్యార్థులకు డ్రెస్సులు, షూస్‌లు విరాళంగా అందజేస్తున్న ఆసిఫ్ ఇక్బాల్

అనాథ విద్యార్థి గృహకు వితరణ

ఎల్బీనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహకు ఐసీఐసీఐ ఫౌండేషన్ సుమారు రూ.6లక్షల విలువైన దుస్తులు, షూస్‌లను విరాళంగా అందజేసింది. ఐసీఐసీఐ ఫౌండేషన్ తెలంగాణ జోనల్ హెడ్ ఆసిఫ్ ఇక్బాల్ బుధవారం ఫౌండేషన్ కార్యాలయంలో గృహ అధ్యక్షుడు మార్గం రమేష్ సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ ఇక్బాల్ 622 షర్ట్స్, 458 ప్యాంట్లు, 120 షూస్‌లు, 250 సాక్స్‌లు, 125టైలు, 39జీన్స్‌లు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గృహ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదింటి వివాహానికి పుస్తె మెట్టెల అందజేత

వనస్థలిపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని పేదలకు సహాయ, సహకారాలు అందించడానికి ముందుంటానని టీపీసీసీ ప్రచార కమిటీ కో-చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నగరంలోని రామంతపూర్‌కు చెందిన నాను ప్రకాశ్, సుజాతల కుమార్తె సోని వివాహానికి, కామారెడ్డికి చెందిన రామగౌడ్, నర్సవ్వ దంపతుల కుమార్తె వెంకటలక్ష్మి వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా పుస్తె మెట్టెలు, చీర, గాజులను ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నాగోల్‌లోని తన నివాసంలో బుధవారం అందజేశారు.


పుస్తెమెట్టెలను అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా

నేడు రక్తదాన శిబిరం

సైదాబాద్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ ఆధ్వర్యంలో సైదాబాద్‌లోని సౌత్ ఈస్ట్ డీసీపీ కార్యాలయం పక్కన హనుమాన్ ఆలయం వద్ద గురువారం 11గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ శిబిరంలో యువకులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి విజయవంతం చేయాలని కోరారు.


తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేసిన కార్పొరేటర్ పవన్‌కుమార్


తన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి


జాతీయ జెండాను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి



తిరంగా ర్యాలీలో తెలంగాణ ప్రైవేటు కాలేజెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

జాతీయ భావాల పరిరక్షణకు సహకరించాలి

కొత్తపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ భావాల పరిరక్షణకు అందరూ సహకరించాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా బుధవారం ఆయన ఇంటిపై జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలు, జాతీయ భావాల స్ఫూర్తితో ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మంచి రాజేష్, సుందర్‌నారాయణ, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర నాయకుడు బొల్లం యశ్పాల్‌గౌడ్ మోహన్‌నగర్ మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, అంగన్‌వాడీ టీచర్లకూ జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, బీజేపీ నాయకులు కిరణ్‌కుమార్, రాజు, తరుణ్‌సింగ్, సంప్రీత విష్ణు, పవన్, వినోద్ పాల్గొన్నారు.

సరూర్‌నగర్‌లో..

ఎల్బీనగర్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ తన ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం త్రివర్ణ పతాకానికి వందనం సమర్పించారు.

ఐఎస్‌సదన్‌లో..

సైదాబాద్: ప్రతీ ఇంటిపై జాతీయజెండా ఎగురవేసే బాధ్యత ప్రజలంతా తీసుకోవాలని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సింగరేణికాలనీ, ప్రెస్‌కాలనీ, కృష్ణానగర్‌లలో కార్పొరేటర్ ఇంటింటికీ తిరిగి పలువురికి జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెస్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శంకరాచారి, దేవేందర్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్ : కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ సంగీత, నాటక అకాడమీ, ప్రజా పరిషత్ సంయుక్తాధ్వర్యంలో బుధవారం దిల్‌సుఖ్‌నగర్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రైవేటు కాలేజెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రాజేశ్వర్‌రెడ్డి తిరంగా ర్యాలీ ప్రారంభించగా ప్రజా పరిషత్ ఎడిటర్ లక్ష్మీనివాస్ పాల్గొన్నారు.


ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్

ఎందరో అమరవీరుల త్యాగఫలితమే దేశ స్వాతంత్ర్యం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

వనస్థలిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎందరో అమరవీరుల త్యాగ ఫలితమే దేశ స్వాతంత్ర్యమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కొనియాడారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో బుధవారం దేశ విభజన గాయాల స్మారక దినం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల మాట్లాడుతూ దేశ ప్రజలకు స్వాతంత్ర్యం దక్కిన సంతోషంతో పాటు దానివెనుక దాగి ఉన్న విభజన బాధలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. ప్రధాని మోదీ బలహీన పడితే దేశం బలహీన పడుతుందని, ప్రపంచంలో దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకవచ్చిన వ్యక్తి ప్రధాని మోదీ అన్నారు. హింసకు తావులేని సమాజమే దేశ లక్ష్యం అన్నారు. ప్రపంచంలో ప్రశాంతంగా ఉన్న జాతి భారతజాతి అన్నారు. దేశంలో ఎలాంటి హింసకు తావులేకుండా దేశం అంతా ఒకే తాటిపై నిలబడిన జాతి మనదే నన్నారు. అందరిని సమానంగా చూస్తూ, మానవత్వాన్ని పంచే దేశంగా భారతదేశం నిలబడిందన్నారు. ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండి అమరవీరుల ఆశయ సాధనకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, నర్సింహగుప్తా, ప్రేమ్, పవన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ కళ్లెం రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌రావు, డివిజన్ అధ్యక్షులు నాంపల్లి రామేశ్వర్, నూతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్


మలక్‌పేట పీఎస్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన పిడమర్తి నరేష్‌ను సన్మానిస్తున్న మైత్రీ కమిటీ కన్వీనర్ లింగాల శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొప్పుల నాగిరెడ్డి, సభ్యులు టీ.అరుణ్‌కుమార్, నర్సింగ్‌గౌడ్, పాషా తదితరులు
- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

న్యాయవాదులకు ఆటలు, సాంస్కృతిక పోటీలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటల పోటీలలో భాగంగా సీనియర్ న్యాయవాదులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పీ. రామిరెడ్డి నాయకత్వంలోని జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టును బార్ అసోసియేషన్ అభినందించింది. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శ్రీనాథ్, వైస్ క్యాప్టెన్ జిల్లా రమేష్, కొండల్‌రెడ్డి, చంద్రారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, రామిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ, లింగం, మీనాక్షి, సుధారాణి, సత్యనారాయణరెడ్డి, జీ. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహకారం అందుకోండి

- 100 డయల్, 112 డయల్ సేవలను సద్వినియోగం చేసుకోండి
- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

కొత్తపేట, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో నిర్భయంగా చట్టపరంగా పోలీసుల సహకారం అందుకోవాలని, 100 డయల్, 112 డయల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. బుధవారం సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎల్బీనగర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించారు. శాంతిభద్రతల పరిరక్షణకు తామున్నామనే భరోసానిస్తూ అటు ప్రజలకు, తగిన విధంగా మార్గదర్శకం చేస్తూ ఇటు క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బందికి ఆయన ప్రేరణ కలిగిస్తున్నారు. ఎన్టీఆర్‌నగర్‌లో సైకిళ్లపై తిరుగుతూ విజిబుల్ పోలీసింగ్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలతో ముచ్చటిస్తూ పర్యటనలో ఆయన సందడి చేశారు. యువకులతోనూ మాట్లాడుతూ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. పోలీసవుతావా అంటూ ఓ బాలుడితో ముచ్చటించారు. ఎక్కువ సంఖ్యలో యువకులూ పోలీస్ ఉద్యోగాల్లో చేరాలన్నారు. వివిధ వీధుల్లో అంతర్గత దారుల్లో స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని అదుపులో పెట్టాలని సిబ్బందికి సూచించారు. ప్రధానంగా మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ బృందాలకు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని మహిళలకు సూచించారు. ఈ పర్యటనలో ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎన్టీఆర్‌నగర్‌లో సీపీ సుధీర్‌బాబు

నేటి నుంచి పౌరాణిక పద్యనాటక పోటీలు

వనస్థలిపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో నవమ(9వ) ఆహ్వాన పౌరాణిక పద్యనాటక 2024 పోటీలు గురువారం నుంచి ఈనెల 18 వరకు వనస్థలిపురంలోని ఎన్జీవోస్‌కాలనీలోని చంద్రకళా వేదికపై నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య అధ్యక్షుడు పంపన వెంకటేశ్వరరావు, కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వనస్థలిపురంలో వారు మాట్లాడుతూ తెలంగాణలోని రంగస్థల కళాకారులను ప్రోత్సహించడానికి తమ సమాఖ్య కృషి చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రంగస్థల కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం.కృష్ణమూర్తి, పీ.వీ.వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎంపీఎస్ వర్దని పాల్గొన్నారు.

హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలి

హయత్‌నగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ తుర్కయంజాల్ చౌరస్తాలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. హిందు ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ తుర్కయంజాల్‌లో నాగార్జునసాగర్ రహదారిపైన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన ఆందోళనలను పక్కదారి పట్టించి హిందువులనే లక్ష్యంగా చేసుకుని దాడులు చేయడం దారుణమని అన్నారు. అతి కౄరంగా హిందువులను హతమార్చడం, అత్యాచారాలు చేయడం, దేవాలయాలను ధ్వంసం చేయడం, ఇళ్లను కూల్చివేయడం లాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నారని అన్నారు. హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కళ్యాణ్‌నాయక్, నాయకులు కరుణాకర్, నర్సింహగౌడ్, శ్రావన్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, కొంతం యాదిరెడ్డి, నిరంజన్‌రెడ్డి, మైలారం బాబు, ధన్‌రాజ్, రాజిరెడ్డి, రాములు, బలరాం, స్వామిగౌడ్, దాస్ గౌడ్ పాల్గొన్నారు.


రంగారెడ్డి జిల్లా కోర్టుల ఎదురుగా జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల నిరసన ప్రదర్శన

రంగారెడ్డి జిల్లా కోర్టులు : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హత్యాచారాలను నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదులు బుధవారం జిల్లా కోర్టుల ఎదురుగా విజయవాడ జాతీయ రహదారిపై ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి డాక్టర్ రావినూతల శశిధర్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఇస్లామిక్ మతోన్మాదుల అరాచకాలపై కేంద్రం కఠినంగా వ్యవహరించాలన్నారు. హిందువులపై జరుగుతున్న హత్యాచారాలు, దేవాలయాలు, హిందువుల ఆస్తుల ధ్వంసం చేయడాన్ని యావత్ ప్రపంచం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ సమయంలో భారతీయ సమాజం బంగ్లాదేశ్ హిందువుల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం బంగ్లాదేశ్‌లోని హిందువులను కాపాడటానికి భారత ప్రభుత్వం అవసరమైన కఠిన నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ తీర్మానం చేసి రాష్ట్రపతి, ప్రధానమంత్రికి పంపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు శ్రీనాథ్, రామారావు, ప్రదీప్, నరేష్, నగేష్, విజయ్‌రాథోడ్, విష్ణువర్ధన్, అర్చన, శోభన, జ్యోత్స్న, సుధారాణి, అనితరాణి, వినోద్, మల్లారెడ్డి, శ్రీశైలం, ఏటీఎఫ్ కన్వీనర్ బ్రహ్మచారి పాల్గొన్నారు.


బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ తుర్కయంజాల్‌లో ర్యాలీ తీస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ సమితి

ఆటో ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి

ఉప్పల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాపిడో బైక్ బుక్ చేసుకొని వెనుక కూర్చున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా, రాపిడో బైక్ నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద జరిగింది. ఉప్పల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుందర్‌రాజు(23) అనే యువకుడు ఉప్పల్ రింగురోడ్డు నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్లేందుకు రాపిడో బైక్ బుక్ చేసుకున్నాడు. అదే ప్రాంతంలో వనస్థలిపురంకు చెందిన చొక్కారపు శ్రీనివాస్ అనే రాపిడో బైక్ నడిపే వ్యక్తి పికప్ పాయింట్ దగ్గరకు వచ్చి సుందర్‌రాజ్‌ను బైక్‌పై ఎక్కించుకున్నాడు. బైక్ ఉప్పల్ రింగురోడ్డు నుంచి యూటర్న్ తీసుకొని ఉప్పల్ మెట్రోస్టేషన్ వద్దకు చేరుకోగానే అతివేగంతో నిర్లక్ష్యంతో ఆటోను నడుపుకుంటూ వేగంగా వచ్చి రాపిడో బైక్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్ వెనుక కూర్చున్న సుందర్‌రాజు రోడ్డుపై పడడంతో తలకు గాయాలై తీవ్రమైన రక్త స్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే, రాపిడో బైక్ డ్రైవర్ శ్రీనివాస్ స్వల్ప గాయాలతో ప్రణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలి

చాదర్‌ఘాట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లపై జరుగుతున్న ఏసీబీ దాడులను స్వాగతిస్తున్నట్లు బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేశ్ కుమార్ వెల్లడించారు. గత కేసీఆర్ ప్రభుత్వం గడచిన నాలుగు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీలు పెంచకుండా తీవ్ర నిర్లక్ష్యం చేసిందని ఆయన విమర్శించారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం గడచిన 10నెలల కాలంలో ఇదే నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కారణంగానే సంక్షేమ హాస్టల్‌లో ఉంటున్న నిరుపేద విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ కొరవడిన మౌలిక సదుపాయాలతో అనారోగ్యానికి గురవుతున్నారని ఆయన ఫిర్యాదు చేశారు. కలుషిత ఆహారంతో ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయన్నారు. తక్షణమే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థుల భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, మెస్‌చార్జీలను వెంటనే విడుదల చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్ నిధులను విడుదల చేయాలని మహేష్‌కుమార్ కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి లక్షలాది విద్యార్థులతో సెక్రెటేరియట్‌ను ముట్టడిస్తామన్నారు. తక్షణమే విద్యాశాఖకు, సాంఘిక సంక్షేమ శాఖకు మంత్రిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గందమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సతీష్, కోశాధికారి నారాయణనాయక్, గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ యన్నమల్ల ప్రవీణ్‌కుమార్, మత్సగిరి, శివ, విప్లవ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహేష్‌కుమార్